
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
అల్లూరి సీతారామరాజు
బుధవారం 20 మార్చి 2024
జిల్లా వార్తలు



జిల్లాలో రేపు తేలికపాటి వర్షం

చింతపల్లి, మార్చి 19: జిల్లా వ్యాప్తంగా గురువారం తేలికపాటి వర్షం కురుస్తుందని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి, ఏడీఆర్ డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. మంగళవారం రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ద్రోణి ప్రభావం వల్ల అరకు, పాడేరు, చింతపల్లి, రంపచోడవరం డివిజన్ల పరిధిలో 21తేదీన 10ఎంఎంకి మించి వర్షం కురుస్తుందన్నారు. ఈనెల 24 వరకు తేమ, మబ్బులతో కూడిన వాతావరణం ఉంటుందని వెల్లడించారు.



కూటమి అభ్యర్థి ఎవరనే దానిపై సర్వత్రా ఆసక్తి

» వైసీపీలోనూ చర్చ

పాడేరుపై వీడని ఉత్కంఠ



(పాడేరు- ఆంధ్రజ్యోతి)

పాడేరు అసెంబ్లీ స్థానం కూటమి అభ్యర్థి ఎవరనే దానిపై ఇంకా ఉత్కంఠ వీడలేదు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా ఈ సీటు ఎవరిని వరిస్తుందోనన్న ఉత్సుకత నెలకొంది. బీజేపీకే ఈ సీటు కేటాయిస్తారని ప్రచారం జరుగుతున్నప్పటికీ ఆ పార్టీ అధికారికంగా ప్రకటన చేయకపోవడంతో అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

జిల్లా కేంద్రం పాడేరు అసెంబ్లీ స్థానం నుంచి కూటమి అభ్యర్థిగా ఎవరు బరిలో దిగుతారోనని అందరూ ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. పొత్తులో భాగంగా ఈ సీటు బీజేపీకి కేటాయిస్తారని జోరుగా ప్రచారం జరుగుతున్నా ఇప్పటికీ దీనిపై స్పష్టత రాకపోవడంతో ఏం జరుగుతుందోననే ఉత్కంఠ రోజు రోజుకు పెరుగుతున్నది. పాడేరు స్థానం తమకే దక్కుతుందని స్థానిక టీడీపీ నేతలు భావిస్తున్నప్పటికీ, తమకు కేటాయించారని బీజేపీ ప్రకటించినట్టుగా ప్రచారం జరుగుతుండడంతో ఈ వ్యవహారం ప్రస్తుతం జిల్లాలో హాట్ పొలిటికల్ టాపిక్‌గా మారింది. వాస్తవానికి అటు టీడీపీ గాని, ఇటు బీజేపీ గాని తమకే పాడేరు అసెంబ్లీ స్థానం కేటాయించారని అధికారికంగా ప్రకటించిన దాఖలాలు లేవు. కానీ జరుగుతున్న ప్రచారం, కొన్ని ఊహాగానాల నేపథ్యంలోనే పాడేరు బీజేపీకి ఇస్తారట అని కొందరంటే.. కాదు టీడీపీకే ఇస్తారని మరికొందరు అంటున్నారు. దీంతో పాడేరు దక్కేదెవరికి.? అనేది చర్చనీయాంశమైంది. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో ఆచీతూచి అడుగులు వేయాలనే లక్ష్యంతోనే ఉమ్మడి అభ్యర్థి ప్రకటనపై మూడు పార్టీలు సంయమనం పాటిస్తున్నాయని తెలుస్తున్నది.

ఉమ్మడి అభ్యర్థిపై వైసీపీలోనే తీవ్ర చర్చ

పాడేరు అసెంబ్లీ టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి ఎవరనేది ఆయా పార్టీల నేతల కంటే, అధికార వైసీపీలోనే తీవ్రమైన చర్చ జరుగుతున్నది. మత్స్యరాస విశ్వేశ్వరరాజును తమ అభ్యర్థిగా ప్రకటించిన వైసీపీ.. ఉమ్మడి అభ్యర్థిని బట్టి తమ ఎన్నికల వ్యూహాలకు పదును పెట్టాలని భావిస్తున్నది. దీంతో ఎవరైతే తమకు గట్టి పోటీ ఇస్తారు?, ఎవరైతే తమ గెలుపు సులభంగా ఉంటుందనే అంశాలపై బేరీజు వేసుకుంటూ ఉమ్మడి అభ్యర్థి ప్రకటన కోసం వైసీపీ నేతలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. దీంతో ఎన్నికల్లో తమ భవితవ్యం ఉమ్మడి అభ్యర్థి ప్రకటనతోనే ముడిపడి ఉందని వైసీపీ నేతలు భావిస్తున్నారు. దీనిపై అటు వైసీపీ, ఇటు టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు సైతం ఉమ్మడి అభ్యర్థి అంశంపైనే మెయిన్‌గా పోకస్ పెట్టాయి.

నిబంధనలు ఉల్లంఘిస్తే

కఠిన చర్యలు

» ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా హెచ్చరిక

» జిల్లా ఎన్నికల అధికారులు, నియోజకవర్గాల ఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్



ఎన్నికల సీఈవో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ భావన వశిష్ఠ, డీఆర్‌వో పద్మావతి

పాడేరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనలను అధికారులు పక్కాగా అమలు చేయాలని, ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ హెచ్చరించారు. జిల్లా ఎన్నికల అధికారులు, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆవరణలు, ప్రభుత్వ స్థలాల్లో ప్రచార హోర్డింగులను తొలగించాలన్నారు. ప్రైవేటు భవనాలపై హోర్డింగులు ఏర్పాటు చేస్తే సంబంధిత భవన యజమాని అనుమతి పొంది ఉండాలన్నారు. వ్యాపార, వాణిజ్య సంస్థల వద్ద ప్రచార బోర్డులు ఏర్పాటు చేయకూడదన్నారు. అలాగే ఈవీఎంల వినియోగంపై పోలింగ్ అధికారులకు ఏప్రిల్ 12న తొలి విడత, మే ఒకటో తేదీన రెండో విడత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అధికారులు అప్రమత్తంగావ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎం.విజయసునీత రంపచోడవరం నుంచి పాల్గొనగా, స్థానిక కలెక్టరేట్‌లో జాయింట్‌కలెక్టర్ భావనా వశిష్ఠ, జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, నోడల్ అధికారులు డీఎల్‌పీవో పీఎస్.కుమార్, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, డీపీఆర్‌వో పి.గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

కిలగాడ ఘాట్ రోడ్డుపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

» ముగ్గురికి తీవ్ర గాయాలు

- వార్త 6వ పేజీలో..

వంద పడకల ఆస్పత్రి పూర్తయ్యేదెన్నడో?



అసంపూర్తిగా ఉన్న మెయిన్ బ్లాక్ నిర్మాణం

» 30 శాతం పనులు పూర్తి

» బిల్లులు సక్రమంగా విడుదలకాక పనులు నిలిపివేసిన కాంట్రాక్టరు

» ప్రస్తుతం ఏరియా ఆస్పత్రిలో అసౌకర్యాల మధ్య వైద్యుల విధులు

» రోగులకూ తప్పని ఇబ్బందులు

చింతపల్లి, మార్చి 19:

చింతపల్లి వంద పడకల ఆస్పత్రి భవన సముదాయాల నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. కాంట్రాక్టరుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో బిల్లులు మంజూరు చేయకపోవడం వల్ల పనులకు బ్రేక్ పడింది. దీంతో స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న ఏరియా ఆస్పత్రిలో చాలీచాలని గదుల్లో వైద్యులు సేవలందిస్తున్నారు. రోగులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చింతపల్లికి వంద పడకల ఆస్పత్రిని 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేస్తూ జీవో జారీ చేసింది. తొలుత ఏపీఆర్ కళాశాల దిగువన సుమారు ఐదు ఎకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించారు. ఆస్పత్రికి కేటాయించిన స్థలం ఏపీఎఫ్‌డీసీకి చెందినదని సంబంధిత శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ స్థల వివాదం పరిష్కారం కాకపోవడంతో నిర్మాణ పనులు ప్రారంభంకాలేదు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చాక 2020లో వంద పడకల ఆస్పత్రికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నూతన భవనాల నిర్మాణానికి నాబార్డు నుంచి రూ.22 కోట్లను మంజూరు చేసింది. 2020 ఆగస్టులో ఈ పనులను టెండర్ ద్వారా నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ దక్కించుకుంది. అదే ఏడాది అక్టోబరులో పనులు ప్రారంభించాల్సి వున్నప్పటికీ స్థల వివాదం కారణంగా పనులు జరగలేదు. ఆస్పత్రి నిర్మాణానికి రెవెన్యూ అధికారులు గతంలో కేటాయించిన స్థలాన్ని రద్దు చేసి ప్రత్యామ్నాయంగా అంతర్లలోనున్న పట్టు పరిశ్రమశాఖకు చెందిన 4.5 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం అప్పగించింది. దీంతో చింతపల్లి వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు 2021 ఆఖరులో ప్రారంభమయ్యాయి. టెండర్ నిబంధనల ప్రకారం 2023 డిసెంబరు నాటికి భవన నిర్మాణాలు పూర్తి చేయాల్సి వున్నప్పటికీ పనులు ఆలస్యంగా ప్రారంభించడం వల్ల 2024 మార్చి నెల వరకు పొడిగించారు. భవన నిర్మాణాల పర్యవేక్షణ బాధ్యతలను ఏపీఎంఎస్‌ఐడీసీకి అప్పగించారు. అయితే ఆస్పత్రి నూతన భవనాల నిర్మాణాలు ఆది నుంచి నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేయడం వల్ల ... మిగతా 6వ పేజీలో



ప్రస్తుతం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఒకే గదిలో నలుగురు వైద్యులు రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

ఓటరు గుర్తింపు కార్డులను వెంటనే పంపిణీ చేయాలి

» అధికారులకు డీఆర్‌వో పి.పద్మావతి సూచన



ఓటరు గుర్తింపు కార్డుల స్కానింగ్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌వో పద్మావతి


పాడేరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): ఓటరు గుర్తింపు కార్డులను సంబంధీకులకు త్వరితగతిన పంపిణీ చేయాలని అధికారులకు జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి సూచించారు. రెండో విడతగా వచ్చిన ఓటరు గుర్తింపు కార్డుల స్కానింగ్ ప్రక్రియను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ఓటరు నమోదులో భాగంగా 1,48,723 మందికి గుర్తింపు కార్డులు ముద్రించారన్నారు. వాటిలో తొలి విడతగా వచ్చిన 68,224 కార్డులను ఇప్పటికే పంపిణీ చేశారన్నారు. అలాగే రెండో విడతగా వచ్చిన 76,149 కార్డుల పంపిణీకి శ్రీకారం చుడతామన్నారు. వాటిని తొలుత ఇక్కడ స్కానింగ్ చేసి, జిల్లాలో ఆయా మండలాలకు పంపించి సంబంధిత వ్యక్తులకు వాటిని అందిస్తామన్నారు. ఈ ప్రక్రియను తహసీల్దార్లు, సిబ్బంది పక్కాగా నిర్వహించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భవాని, ఎంపీడీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 269 మంది విద్యార్థులు గైర్హాజరు

పాడేరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో టెన్త్ పరీక్షకు 269 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఇంగ్లీష్ పరీక్షకు మొత్తం 11,211 మంది హాజరుకావాల్సి ఉండగా 10,942 మంది మాత్రమే హాజరయ్యారని, 269 మంది గైర్హాజరయ్యారన్నారు. మొత్తం 11,211 మంది విద్యార్థుల్లో 11,118 మంది రెగ్యులర్, 93 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలకు హారుకావాల్సి ఉందన్నారు. కానీ రెగ్యులర్ 10,916 మంది, ప్రైవేటు 26 మంది హాజరయ్యారని, రెగ్యులర్ విద్యార్థులు 202 మంది, ప్రైవేటు విద్యార్థులు 67 మంది గైర్హాజరయ్యారన్నారు. జిల్లాలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని డీఈవో తెలిపారు.

సీలేరు, పొల్లూరుల్లో విద్యుదుత్పత్తి పునఃప్రారంభం

గోదావరి డెల్టాకు 3500 క్యూసెక్కుల నీరు విడుదల



పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం

సీలేరు, మార్చి 19: సీలేరు కాంప్లెక్సు పరిధిలోని సీలేరు, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని మంగళవారం పునఃప్రారంభించారు. వేసవిలో విద్యుత్ డిమాండ్‌కు అవసరమైన ఉత్పత్తి చేసేందుకు, గోదావరి డెల్టా రబీ పంటలకు నీరు విడుదల చేయాల్సిన నేపథ్యంలో గత నెల 10 నుంచి మార్చి 7 వరకు సీలేరు కాంప్లెక్సులో విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. అయితే లోడ్ డిస్పాచ్ అధికారుల ఆదేశాల మేరకు మార్చి 7 నుంచి మొదటిగా డొంకరాయిలో విద్యుదుత్పత్తిని పునఃప్రారంభించగా, మంగళవారం నుంచి కాంప్లెక్సు పరిధిలోని సీలేరు, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో కూడా విద్యుదుత్పత్తిని పునఃప్రారంభించారు. సీలేరు కాంప్లెక్సులో విద్యుదుత్పత్తి అనంతరం గోదావరి డెల్టాకు 3500 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుంది. అయితే గోదావరి డెల్టా రబీ పంటలకు మరికొస్త నీటి విడుదల అవసరముందని ఇరిగేషన్ అధికారుల విన్నపంపై జెన్‌కో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాల్సి ఉందని స్థానిక జెన్‌కో అధికారులు తెలిపారు. సీలేరు కాంప్లెక్సులో ప్రస్తుతం 32 టీఎంసీల నీటి నిల్వలు మాత్రమే ఉండడంతో వేసవిలో విద్యుత్ అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా, గోదావరి డెల్టాకు నీటి అవసరాలు తీర్చేలా చర్యలు చేపడుతున్నట్టు తెలిసింది. సీలేరు, డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో మంగళవారం నుంచి రోజుకు మూడు నుంచి నాలుగు మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరుగుతుందని జెన్‌కో వర్గాలు వెల్లడించాయి. సీలేరులో విద్యుదుత్పత్తి నేపథ్యంలో బలిమెల జలాశయం నుంచి రెండు వేల క్యూసెక్కుల నీటిని ఆంధ్రా వాటాగా వినియోగిస్తున్నారు.



సీలేరు జలవిద్యుత్ కేంద్రం

మాచ్‌ఖండ్‌లో విద్యుదుత్పత్తికి నీటి కొరత


» ప్రాజెక్టులో 3వ నంబరు జనరేటర్ నిలిపివేత



ముంచంగిపుట్టు, మార్చి 19: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పాదన కొంత మేర నిలిచిపోయింది. విద్యుదుత్పత్తికి అవసరమైన నీరు లేకపోవడంతో మంగళవారం ప్రాజెక్టులో 3వ నంబరు జనరేటర్‌ను నిలిపివేశారు. నీటి కొరత వల్ల ఇప్పటికే 4వ నంబరు జనరేటర్‌ను నిలిపివేసిన విషయం తెలిసిందే. తాజాగా మరో జనరేటర్‌ను ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు నిలిపివేశారు. దీంతో మొత్తం ఆరు జనరేటర్ల సహాయంతో 120 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసే సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టులో ప్రస్తుతం 1వ నంబరు జనరేటర్ సహాయంతో కేవలం 17 మెగావాట్ల విద్యుదుత్పత్తి మాత్రమే చేపడుతున్నారు. గతేడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, ఈ ఏడాది వేసవి ప్రారంభం నుంచే ఎండలు దారెత్తించడంతో మత్స్యగెడ్డ ప్రవాహిత నీటిపై ఆధారపడి ఉన్న జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టాయి. దీంతో జలవిద్యుత్ కేంద్రానికి ఆశించిన స్థాయిలో నీటిని సరఫరా చేయలేకపోతున్నారు. రానున్న రోజుల్లో జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి పూర్తి స్థాయిలో నిలిచిపోయే అవకాశం ఉంది.

అదనపు షాక్

వినియోగదారులపై ఈపీడీసీఎల్ దొంగదెబ్బ



» 250 యూనిట్లలోపు వినియోగిస్తున్న వారికి నోటీసులు

» ఎక్కువ లోడ్ పడుతున్నందున

» అర్జెంట్‌గా రూ.4,450 కట్టాలని ఆదేశం

» నెలాఖరులోగా చెల్లించకపోతే కనెక్షన్ కట్ అంటూ హెచ్చరికలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) అధికారులు ఆదాయం పెంచుకోవడానికి వినియోగదారులపై అదనపు భారం మోపుతున్నారు. గతంలో ఒకసారి అదనపు లోడ్ అంటూ నోటీసులు ఇచ్చి కొద్దిపాటి మొత్తాలు వసూలు చేశారు. ఇప్పుడు మళ్లీ అదేబాటలో వెళుతూ నోటీసులు ఇస్తున్నారు.

ఈపీడీసీఎల్ సిబ్బంది కొద్ది రోజులుగా నెలకు 75 యూనిట్ల నుంచి 250 యూనిట్ల మధ్య వినియోగించే వారి ఇళ్లకు వెళ్లి ఏయే విద్యుత్ పరికరాలు వినియోగిస్తున్నారో పరిశీలిస్తున్నారు. ఒక కిలోవాట్ కోసం విద్యుత్ కనెక్షన్ తీసుకొని ఎక్కువ లోడ్ వాడుతున్నారని చెబుతున్నారు. కనెక్షన్ కోసం దరఖాస్తు చేసినప్పుడు ఏసీ, వాషింగ్ మెషిన్ వంటివి చూపించలేదని, ఇప్పుడు అవన్నీ వినియోగిస్తున్నందున ఎక్కువ లోడ్ పడుతోందని, అందుకు తగిన మొత్తాలు చెల్లించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఆ తరువాత రెండు రోజులకు ఒక నోటీసు పంపుతున్నారు. ఒక కిలోవాట్‌కు బదులు మూడు కిలోవాట్లు వాడుతున్నందున, అదనంగా రెండు కిలోవాట్లకు సర్వీస్, డెవలప్‌మెంట్ చార్జీలు, సెక్యూరిటీ డిపాజిట్, అప్లికేషన్ ఫీజుతో పాటు జీఎస్టీ చెల్లించాలని అంటున్నారు. మొత్తం రూ.4,459 కట్టాలని డిమాండ్ నోటీసులు పంపుతున్నారు. అందులో రూ.4 వేలు అచ్చం డెవలప్‌మెంట్ చార్జీల కింద చూపిస్తున్నారు. సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.400, అప్లికేషన్ ఫీజు రూ.50, జీఎస్టీగా రూ.9 వేసి మొత్తం రూ.4,459 నెలాఖరులోగా చెల్లించాలని ఆదేశిస్తున్నారు. అలా చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తామని, ఆ మొత్తం చెల్లించాకే పునరుద్ధరిస్తామని అంటున్నారు. ఇలా ఒక్క జోన్-3 లోనే రెండు వేల మందికి నోటీసులు జారీచేశారు. అలాగే జోన్-2, జోన్-1లో కూడా వేలాది మందికి ఈ నోటీసులు ఇస్తున్నారు. వీరంతా మధ్య తరగతివారే కావడం గమనార్హం.

క్రమబద్ధీకరించుకోకపోతే ఇబ్బందే

అదనపు లోడు విషయాన్ని ఈపీడీసీఎల్ జోనల్ అధికారి వద్ద ప్రస్తావించగా వినియోగదారులు నిర్దేశించిన లోడుకు మించి ఉపయోగిస్తున్నప్పుడు దానికి అదనపు చార్జీలు చెల్లించక తప్పదని స్పష్టంచేశారు. నోటీసులు అందుకున్నవారు ఎవరైనా అదనపు లోడు వినియోగించకపోతే దానిని లేఖ ద్వారా తెలియజేయవచ్చునని, మరోసారి వచ్చి పరిశీలిస్తారన్నారు. నిర్ధారణ అయితే దానికి సూచించిన ఫీజులు డీడీ రూపంలో కట్టి మీ-సేవా కేంద్రంలో ప్రత్యేక దరఖాస్తు ద్వారా క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు.

- ఈపీడీసీఎల్ జోనల్ అధికారి

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధ)	6.11
సహరి (గురు)	4.48



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి దొన్నుదొర

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

» టీడీపీ అరకు నియోజకవర్గ అభ్యర్థి సియ్యారి దొన్నుదొర

డుంబ్రిగుడ, మార్చి 19: అరకు నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి సియ్యారి దొన్నుదొర పిలుపునిచ్చారు. డుంబ్రిగుడలోని పార్టీ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీని ఇంటికి సాగనంపేందుకు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఏర్పడ్డాయన్నారు. అరకులో టీడీపీ జెండాను ఎగిరేసి చంద్రబాబుకు కానుకగా అందిద్దామని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజల ముందుకు తీసుకువెళ్లి టీడీపీ విజయానికి పూనుకుందామన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయారని, జగన్ చెప్పే మాయమాటలను నమ్మేస్థితిలో ప్రజలు లేరని పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడిన వైసీపీకి రానున్న ఎన్నికల్లో ఓటుతో గిరిజన ప్రజానీకం బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు కలిసి క్షేత్రస్థాయిలో సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల్లోకి వెళ్లి టీడీపీ గెలుపునకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తడుము సుబ్బారావు, అరకు పార్లమెంట్ కోశాధికారి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు గీత, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు భాస్కరరావు, కొములునాయుడు, మాజీ సర్పంచులు సుబ్బారావు, లక్ష్మి, నాయకులు చినగెన్ను, సింహాద్రి, రవి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేద్దాం

» బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లా రామకృష్ణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా నేత రామకృష్ణ

పాడేరు రూరల్, మార్చి 19: అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని బీజేపీ-టీడీపీ-జనసేన ఉమ్మడి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేద్దామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లా రామకృష్ణ కోరారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్న లక్ష్యంతోనే మూడు పార్టీలు కూటమిగా ఏర్పడ్డాయని, ఈ విషయం అందరికీ తెలిసిందేనని చెప్పారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల నిరంకుశ పాలనపై ప్రజలు, ఉద్యోగులు, నిరుద్యోగ యువత, మహిళలు తీవ్ర అసహనంతో ఉన్నారన్నారు. వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్‌ను చూడాలని రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే నిధులకు జగన్‌రెడ్డి స్టిక్కర్ అంటించుకొని ప్రచారం చేసుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ నేత నందోలి శివకృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పక్కాగా అమలుచేయాలి



అసరాడలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

చింతపల్లి, మార్చి 19: మండలంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆదేశించారు. మండలంలోని లక్కవరపుపేట, దేవరాపల్లి, సంకాడ, అసరాడ గ్రామ పంచాయతీలను మంగళవారం సందర్శించి ఎన్నికల నియమావళి అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి, గ్రామ సచివాలయం ఉద్యోగులతో మాట్లాడుతూ రాజకీయ నాయకుల బ్యానర్లు, ఫ్లెక్సీలు పూర్తి స్థాయిలో తొలగించాలన్నారు. ఎక్కడా రాజకీయ పార్టీ జెండాలు ఉండరాదన్నారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల చిత్రాలు, విగ్రహాలకు మాస్కులు వేయాలన్నారు. గ్రామాల్లో ఎన్నికల నియమావళిని అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నియమావళిని సమర్థవంతంగా అమలుచేయని ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

దొంతులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



భక్తులతో రద్దీగా ఉన్న దొంతులమ్మ ఆలయం

చింతపల్లి, మార్చి 19: తాజంగి పంచాయతీ పరిధిలోని దొంతులమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి జాతర సోమవారం ప్రారంభమైంది. ఈ మేరకు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయం భక్తులతో రద్దీగా కనిపించింది. బుధవారం కూడా ప్రత్యేక పూజలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

చిరుధాన్యాల విలువ హెచ్చింపుపై శిక్షణ



శిక్షణ పొందిన మహిళలతో సంస్థ ప్రతినిధులు

పాడేరు రూరల్, మార్చి 19: చిరుధాన్యాల విలువ హెచ్చింపుపై వంజంగి పంచాయతీ బొర్రమామిడి గ్రామంలో 15 రోజులుగా అందిస్తున్న శిక్షణ మంగళవారంతో ముగిసింది. కొత్తవలస గ్రామంలో మహిళలకు చిరుధాన్యాలతో అల్పాహారం తయారీ, బొర్రమామిడి గ్రామ మహిళలకు పసుపు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణను అందించామని స్మైల్ సంస్థ డైరెక్టర్ మురళి తెలిపారు. ముగింపు కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలను పంపిణీ చేశామన్నారు. శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలంటే అవసరమైన సహకారం అందిస్తామని యూనియన్ బ్యాంక్ ఎల్‌డీఎం ఎన్.రవితేజ, ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీటీ కేవీకే శాస్త్రవేత్తలు దివ్యసుధ, రోస్ మేరి, సంస్థ ప్రతినిధి రవికుమార్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి

అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభిషేక్



లక్ష్మీపురం పోలింగ్ కేంద్రం వద్ద సౌకర్యాలపై ఆరా తీస్తున్న అభిషేక్

ముంచంగిపుట్టు, మార్చి 19: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆదేశించారు. మండలంలోని మారుమూల బరడ, లక్ష్మీపురం, కించాయిపుట్టు, ఏనుగురాయి, మాకవరం, వనుగుమ్మ, రంగబయలు, బుంగాపుట్టు, బంగారుమెట్ట తదితర పంచాయతీల్లో ఏర్పాటు చేసిన సుమారు 15 పోలింగ్ కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద కల్పించిన మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఎన్నికల నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్ తదితర ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే లక్ష్మీపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పీవో పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఎన్నికల నియమ నిబంధనలను ప్రతీ ఒక్కరూ పాటించాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సక్రమంగా అమలు చేయాలని, ఎన్నికల నియమాలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు విజయవంతం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రఫీ జాన్, ఎన్నికల ప్రత్యేక అధికారులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టిక్కెట్ గిడ్డి ఈశ్వరికి కేటాయించాలి

» పార్టీ మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు

» నియోజకవర్గం పరిధిలోని మండలాల్లో ర్యాలీలు



చింతపల్లిలో ర్యాలీ చేస్తున్న టీడీపీ నాయకులు, స్థానిక ప్రజలు

చింతపల్లి, మార్చి 19: పాడేరు ఎమ్మెల్యే టికెట్ టీడీపీకే కేటాయించాలని పార్టీ మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో ఎస్సీ కాలనీ నుంచి పాత బస్టాండ్ వరకు పార్టీ శ్రేణులతో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎనిమిదేళ్ల నియోజకవర్గంలో పార్టీని ముందుకు నడిపించడంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. మూడేళ్లుగా పార్టీకి ప్రజాదరణ భారీగా పెరిగిందన్నారు. వైసీపీ వ్యతిరేక ఓటర్లు పార్టీలో చేరారన్నారు. గిడ్డి ఈశ్వరికి టిక్కెట్ కేటాయిస్తే భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని, అధిష్ఠానం తమ అభ్యర్థనను పరిగణలోకి తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు రీమల ఆనందరావు, అంద్రాబు లక్ష్మణ్, లక్కోజు నాగ భూషణం, రీమల ఝాన్సీ, మంగు, చందాడ చిన్న పాల్గొన్నారు.

జి.మాడుగులలో...

జి.మాడుగుల, మార్చి 19: పాడేరు ఎమ్మెల్యే టిక్కెట్‌ను ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరికి కేటాయించాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలు కోరారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ముఖ్యనేతలు, అభిమానులు, అనుబంధ సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు వంతాల కొండలరావు మాట్లాడుతూ గిడ్డి ఈశ్వరి నేతృత్వంలో పాడేరు నియోజకవర్గంలో పార్టీ పటిష్టంగా ఉందని, టీడీపీకి టికెట్ ప్రకటిస్తే సునాయసంగా గెలిపించుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.కల్యాణం, ఎం.లక్ష్మణ్‌రావు, కె.భీంబాబు,పి.భీంబాబు, కె.లక్ష్మణ్‌రావు, క్రిష్ణమూర్తినాయుడు, ఎల్.రామకృష్ణ, జి.కొండబాబు, పి.చిన్నారావు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధిలో...

గూడెంకొత్తవీధి, మార్చి 19: పాడేరు ఎమ్మెల్యే టికెట్‌ను టీడీపీకి కేటాయించాలని పార్టీ మండల అధ్యక్షుడు ముక్కలి రమేశ్ కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. నియోజకవర్గంలో టీడీపీ విజయవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. పార్టీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరికి అసెంబ్లీ స్థానంలో పోటీ చేసే అవకాశం కల్పించాలన్నారు. పార్టీ కార్యకర్తల అభ్యర్థనను అధిష్ఠానం స్వీకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముర్ల కాటేశ్వరరావు, కొండలరావు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల్లో కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వొద్దు

» గిరిజన సంక్షేమ విద్యా శాఖ డీడీ కొండలరావు



చింతపల్లిలో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీడీ కొండలరావు

చింతపల్లి, మార్చి 19: పదో తరగతి పరీక్షల్లో ఎక్కడా మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వకుండగా పక్కాగా నిర్వహించాలని గిరిజన సంక్షేమ విద్యా శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు ఆదేశించారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో జరుగతున్న దూర విద్య ఇంటర్మీడియట్ పరీక్షలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో డీడీ మాట్లాడుతూ రెగ్యులర్, దూర విద్య పది, ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. విద్యార్థులు కాపీయింగ్ పాల్పడకుండగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో పూర్తి స్థాయి సదుపాయాలు కల్పించామన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం స్థానిక జూనియర్, డిగ్రీ కళాశాల పోస్టుమెట్రిక్ వసతి గృహాను సందర్శించి భోజనాలను పరిశీలించారు. వసతిగృహాల్లో మెనూ కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి, పీజీహెచ్‌ఎం సాగిన రామరాజు పడాల్, హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు పాల్గొన్నారు.

కిలగాడ ఘాట్ రోడ్డుపై ద్విచక్ర వాహనాలు ఢీ

» ముగ్గురికి తీవ్ర గాయాలు.. పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలింపు



సంఘటనా స్థలంలో తీవ్ర గాయాలతో పడివున్న యువకులు

ముంచంగిపుట్టు, మార్చి 19: మండల కేంద్రం నుంచి పెదబయలు వెళ్లే మార్గమధ్యంలో గల కిలగాడ ఘాట్ రోడ్డుపై ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు మంగళవారం ఢీకొన్నాయి. ఈ సంఘనటలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని లక్ష్మీపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న కె.అర్జున్ తన స్వగ్రామమైన డుంబ్రిగుడ మండలం గుంటసీమకు మంగళవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. అలాగే పెదబయలు మండలం సీకరి పంచాయతీ అరిమెర గ్రామానికి చెందిన కె.సీతారాం, ఒడిశా రాష్ట్రం కోరాపుట్టు జిల్లా చట్వా పంచాయతీ మండిపాదర్ గ్రామానికి చెందిన జి.రమేష్ ద్విచక్ర వాహనంపై ముంచంగిపుట్టు వస్తున్నారు. కిలగాడ ఘాట్ రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న వారి వాహనాలు ఢీకొన్నాయి. దీంతో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ క్షతగాత్రుల పరిస్థితి చూసి అంబులెన్స్‌ను రప్పించి దగ్గరుండి ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించే ఏర్పాటు చేశారు. బాధితులకు వైద్యులు గీతాంజలి, సంతోష్, రమేష్ చికిత్స చేశారు. పరిస్థితి విషమంగా ఉన్న ఉపాధ్యాయుడు అర్జున్‌ను మెరుగైన వైద్య సేవల కోసం పాడేరు జిల్లా ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. క్షతగాత్రులను జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సంఘటనపై ఉపాధ్యాయుడు భార్య సరోజిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.రవీంద్ర తెలిపారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించొద్దు : ఆర్డీవో జయరాం

నర్సీపట్నం అర్బన్, మార్చి 19: ఎన్నికల కోడ్‌ను అతిక్రమించకుండా రాజకీయ పార్టీల నాయకులు ప్రచారాలు, ఊరేగింపులు నిర్వహించుకోవాలని ఆర్డీవో హెచ్‌వీ. జయరాం కోరారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో గల నాలుగు మండలాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోటీలో వున్న అన్ని పార్టీల అభ్యర్థులు ఊరేగింపులు, సమావేశాలపై ముందస్తుగా అనుమతులు పొందాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగేందుకుగాను రాజకీయ పార్టీల నేతలు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల తహసీల్దార్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

'వలంటీర్లు ఎన్నికల ప్రచారం చేస్తే చర్యలు'

నక్కపల్లి, మార్చి 19: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వలంటీర్లు ఎన్నికల ప్రచారం చేసినా, ఓటర్లను ప్రలోభపెట్టినట్టు రుజువైతే ఉద్యోగానికే ప్రమాదమని పాయకరావుపేట రిటర్నింగ్ అధికారిణి గీతాంజలి హెచ్చరించారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నాలుగు మండలాల తహసీల్దార్లు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వలంటీర్లు కచ్చితంగా ఎన్నికల కోడ్‌ను పాటించాలన్నారు. వలంటీర్లు రాజకీయపార్టీల ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనకుండా చూడాలని ఎంపీడీవోలకు సమాచారం ఇచ్చామన్నారు.

వంద పడకల ఆస్పత్రి పూర్తయ్యేదెన్నడో?

... 5వ పేజీ తరువాయి



అసంపూర్తిగా ఉన్న చింతపల్లి వంద పడకల ఆస్పత్రి నిర్మాణాలు

పనులు వేగవంతం కాలేదు. రెండున్నర ఏళ్లలో కేవలం 30 శాతం మాత్రమే పనులు జరిగాయి.

నిలిచిపోయిన పనులు

భవన సముదాయాల నిర్మాణం కోసం కన్‌స్ట్రక్షన్ కంపెనీ రూ.7 కోట్లు ఖర్చు చేసి పనులు చేపట్టగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.4.5 కోట్లు మాత్రమే బిల్లులు విడుదల చేసింది. మిగతా రూ.2.5 కోట్ల బకాయి చెల్లించాలని ప్రభుత్వానికి ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీరింగ్ అధికారులు బిల్లులు పంపించారు. అయితే ఎనిమిది నెలలుగా ఎదురుచూపులే తప్ప బిల్లులు విడుదల కాలేదు. దీంతో కన్‌స్ట్రక్షన్ కంపెనీ 15 రోజుల క్రితం పనులను నిలిపివేసింది.

చాలీచాలని గదుల్లోనే వైద్య సేవలు

ప్రస్తుతం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న ఏరియా ఆస్పత్రిలో చాలీచాలని గదుల్లోనే వైద్యులు సేవలందిస్తున్నారు. ఒకే గదిలో నలుగురు వైద్యులు కూర్చొని రోగులను పరీక్షిస్తున్నారు. రోగులకు సరిపడా వార్డులు లేవు. ఆపరేషన్ థియేటర్ చాలా చిన్నగదిలో నిర్వహిస్తున్నారు. ప్రసూతి, ల్యాబ్‌లు నిర్వహణకు వైద్యులు నానా అవస్థలు పడుతున్నారు. రోగులు సైతం వసతి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. చింతపల్లికి వంద పడకల ఆస్పత్రి మంజూరైందని ఆనందించిన ఈ ప్రాంతవాసులకు ఇప్పటికీ అది అందుబాటులోకి రాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వంద పడకల ఆస్పత్రి వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

☛ సంక్షిప్తంగా..

ప్రజాగళం సభ భద్రత వైఫల్యంపై విచారణ చేపట్టాలి: గిడ్డి ఈశ్వరి

పాడేరు రూరల్, మార్చి 19: దేశ ప్రధాని నరేంద్ర మోదీ హాజరైన ప్రజాగళం సభ భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు ఉన్నతాధికారులపై చీఫ్ ఎలక్షన్ కమిషన్ తక్షణమే చర్యలు చేపట్టాలని తెలుగుదేశం పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సభా ప్రాంగణంలోకి లక్షలాది మంది ప్రజలు తోసుకు వస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూడడం దేనికి సంకేతమని ఆమె ప్రశ్నించారు. బీజేపీ-టీడీపీ-జనసేన తొలి ఎన్డీయే సభ నభూతో నభవిష్యత్ అన్నట్టు విజయవంతమైందన్నారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేశారన్నారు. ట్రాఫిక్ జామ్ కారణంగా వేలాది మంది సభకు హాజరుకాలేకపోయారన్నారు. ప్రధాని భద్రత, ట్రాఫిక్ నియంత్రణ వంటి ప్రధాన అంశాలను పోలీసు బాస్‌లు ఎందుకు పట్టించుకోలేదో చీఫ్ ఎలక్షన్ కమిషన్ సమగ్ర విచారణ చేయాలని కోరారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంతో పాటు అందులో పనిచేస్తున్న కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగానే సభకు అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నించారని ఆమె ఆరోపించారు. ప్రధాని సభాముఖంగా రాష్ట్ర ప్రజల కష్టాలు తనకు తెలుసని చెప్పడం ఆనందంగా ఉందన్నారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. అవినీతి, దోపిడీలో అధికార వైసీపీ నేతలు పోటీ పడ్డారని సభ ద్వారా ప్రధాని స్పష్టం చేశారన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంపై ప్రజాగ్రహం ఏ స్థాయిలో ఉందో చిలకలూరిపేట సభ ద్వారా తెలుస్తున్నదని ఆమె పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణదారులపై చర్యలు

» డిప్యూటీ తహసీల్దార్ క్రిష్ణారావు

హుకుంపేట, మార్చి 19: మండల కేంద్రంలో గిరిజనేతరులు చేపట్టిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని డిప్యూటీ తహసీల్దార్ ఎస్.క్రిష్ణారావు చెప్పారు. అక్రమ నిర్మాణాలకు వ్యతిరేకంగా హుకుంపేటలో గిరిజనులు చేపడుతున్న దీక్షా శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ విజయసునీత ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలు జరగకుండా చూస్తామని, ఎన్నికల అనంతరం కేసులు నమోదు చేసి అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని హామీ ఇచ్చారు. అలాగే 1/70 ఉల్లంఘించకుండా పటిష్ట చర్యలు చేపడతామన్నారు. దీంతో గిరిజనులు దీక్షలను విరమించారు. ఈ కార్యక్రమంలో నిరసనకారులు ఆనంద్, లక్ష్మణరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పాడేరులో ఆరుగురు విద్యార్థుల గైర్హాజరు

పాడేరు రూరల్, మార్చి 19: మండల కేంద్రంలో రెండో రోజు జరిగిన పదో తరగతి పరీక్షలకు ఆరుగురు విద్యార్థులు గైర్హాజయ్యారు. పాడేరులో ఏర్పాటు చేసిన ఐదు పరీక్ష కేంద్రాల్లో మండలంలోని 14 పాఠశాలలకు చెందిన 852 మంది విద్యార్థినీ, విద్యార్థులు రెండో రోజు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 846 మంది వచ్చారు. ఏపీఆర్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 200 మంది హాజరుకావాల్సి ఉండగా 199 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో 125 మందికి 124 మంది, తలారిసింగిలో 200 మందికి 200 మంది, శ్రీకృష్ణాపురంలో 195 మందికి 193 మంది, లోచలిపుట్టు కేంద్రంలో 132 మంది హాజరు కావాల్సి ఉండగా 130 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈవో-1 ఎస్.రామచందరరావు తెలిపారు.

గిడ్డి ఈశ్వరికి టిక్కెట్ ఇవ్వాలని తీర్మానం

పాడేరు రూరల్: పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం టిక్కెట్‌ను తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరికి కేటాయించాలని నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీలు, కుటుంబ సాధికార సారథులు, సీనియర్ నాయకులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు ఆయా మండలాల్లో తీర్మానాలతో సంతకాలను సేకరించి పార్టీ అధినేత చంద్రబాబుకు తెలిసేందుకు టీడీపీ కార్యాలయానికి పంపించామని ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు తెలిపారు. ఈశ్వరికే టిక్కెట్ కేటాయించాలని మండల కేంద్రాల్లో బుధవారం నుంచి దీక్షలు చేయాలన్న ఆలోచనలో ఉన్నట్టు వారు చెప్పారు.


దొంగతనాలపై అప్రమత్తత అవసరం

ముంచంగిపుట్టు, మార్చి 19: చోరీలు జరగకుండా ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జిమాడుగుల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ స్పష్టం చేశారు. గత కొద్ది రోజులుగా మండల కేంద్రంతో పాటు పలు చోట్ల దొంగతనాలు, దారి దోపిడీలు అవుతున్న విషయం తెలిసిందే. దీంతో స్థానిక వర్తకులతో మంగళవారం సీఐ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల ముందు ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి వేళల్లో ఒక విద్యుత్ బల్బును వేసి ఉంచాలని సూచించారు. వ్యాపారులు, ఇళ్ల యజమానులు ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు తమవంతు కృషి చేస్తున్నామని, వ్యాపారుల నుంచి సైతం సహకారం అవసరమని ఆయన కోరారు. అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించరాదని, అనుమానాస్పందంగా ఎవరైనా సంచరిస్తున్నట్టు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. రాత్రి వేళల్లో పోలీస్ గస్తీ నిర్వహిస్తున్నామని, అర్ధ రాత్రి 12 గంటలు దాటిన తరువాత అత్యవసరమైతేనే బయటకు రావాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వర్తకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ

సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లు

జి.మాడుగుల: వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని సంఘం మండల అధ్యక్షుడు ఎస్.నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాడేరులో మంగళవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ నెలతో కాంట్రాక్టు ముగుస్తుండడంతో కొనసాగింపు అనుమతి కోసం చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే జీవో నంబర్ 167 ప్రకారం శతశాతం గ్రాస్ జీతం ఇవ్వాలని విన్నవించామన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యుడు ఎస్.బాలయ్య, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్రైం... crime news

32 కిలోల గంజాయి స్వాధీనం, ముగ్గురి అరెస్టు


పట్టుకున్న గంజాయితో డీఎస్పీ సత్యనారాయణ, పోలీసు అధికారులు

సబ్బవరం, మార్చి 19: ఆటోలో తరలిస్తున్న 32 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిపై అనకపల్లి ఫ్లైఓవర్ వద్ద ఎస్.ధనుంజయ్ మంగళవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తున్నారు. సబ్బవరం వైపు నుంచి అనకాపల్లి వెళుతున్న ఒక ఆటోను ఆపి తనిఖీ చేయగా గంజాయిని రెండు కిలోల చొప్పున ప్యాకింగ్ చేసిన 16 ప్యాకెట్లు కనిపించాయి. ఆటోలో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లికి చెందిన కిల్లో గిరిబాబు, వంతల చంటిబాబు, వంతల కోటేశ్వరరావును అదుపులోకి తీసుకుని ఆటోతో సహా పోలీసు స్టేషన్‌కు తరలించారు. చింతపల్లిలో ఓ వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసినట్టు నిందితులు చెప్పారు. అనంతరం గంజాయిని, ఆటోను సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కేసును సీఐ పిన్నింటి రమణ దర్యాప్తు చేస్తారని డీఎస్పీ చెప్పారు.

భార్యను వేధించిన కేసులో జైలు శిక్ష, జరిమానా

సబ్బవరం, మార్చి 19: భార్యను వేధింపులకు గురిచేసినట్టు నేరం రుజువు కావడంతో ముద్దాయితోపాటు అతని సోదరుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ అనకాపల్లి 7వ ఎంఎం కోర్టు జడ్జి తీర్పు చెప్పారని సీఐ పిన్నింటి రమణ తెలిపారు. మండలంలోని బోదివలస గ్రామానికి చెందిన నేబర్తి శ్రీను, త్రివేణి భార్యాభర్తలు. అయితే భర్తతోపాటు అతని తమ్ముడు రమేశ్, సోదరి బెల్లి పద్మ తనను వేధిస్తున్నారంటూ త్రివేణి 2020 జూలై 7న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. బాధితురాలి తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మృనాళిని వాదనలు వినిపించారు. నిందితులపై మోపిన అభియోగం రుజువు కావడంతో బాధితురాలి భర్త నేబర్తి శ్రీనుకు ఏడాది జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా, ఇతని సోదరుడు రమేశ్‌కు నెల రోజులు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ జడ్జి బీవీవీ విజయలక్ష్మి తీర్పు చెప్పారు.

15 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, మార్చి 19: మండలంలోని పెదముషిడివాడ గ్రామానికి చెందిన జె.త్రినాథ్ నుంచి 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. లంకెలపాలెంలోని ప్రభుత్వం దుకాణం నుంచి పరిమితికి మించి మద్యం కొనుగోలు చేసి తీసుకెళుతున్నట్టు సమాచారం అందడంతో మంగళవారం నిఘా పెట్టామన్నారు. లంకెలపాలెం నుంచి పెదముషిడివాడ వెళుతున్న జె.త్రినాథ్‌ను ఆపి తనిఖీ చేయగా మద్యం సీసాలు లభ్యమయ్యాయన్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

50 లీటర్ల నాటు సారా స్వాధీనం

నర్సీపట్నం, మార్చి 19 : సెబ్ అధికారులు పురపాలక సంఘం పరిధి పెదబొడ్డేపల్లిలో నిర్వహించిన దాడుల్లో 50 లీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకొని 1250 లీటర్లు బెల్లం పులుపు ధ్వంసం చేశారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ కె.సునీల్‌కుమార్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం పెదబొడ్డేపల్లి గ్రామానికి చెందిన పిల్లి సత్తిబాబు(37)ను అరెస్టు చేసి 50 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని, 250 లీటర్లు బెల్లం పులుపు ధ్వంసం చేశారు. ఈ కేసులో పెంకె చిన్న పరారీలో ఉన్నట్టు సెబ్ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. అదే గ్రామంలో మరో చోట దాడులు చేసి 1000 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం చేశామని తెలిపారు. ఈ కేసులోని నిందితుడు పిల్లి సత్తిబాబుపై గత ఏడాది బైండోవర్ కేసు ఉందని తెలిపారు.

భవనం పైనుంచి జారిపడి తాపీమేస్త్రీ మృతి

కోటవురట్ల, మార్చి 19: తాపీమేస్త్రీ ఒకరు నాలుగు అంతస్థుల భవనం పైనుంచి ప్రమాదవశాత్తూ జారిపడి మృతిచెందాడు. కోటవురట్ల ఎస్ఐ రమణయ్య అందజేసిన వివరాలిలా ఉన్నాయి. కోటవురట్ల మండలం లింగాపురం గ్రామానికి చెందిన యాసారపు రామకృష్ణ(25) తాపీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా కోటవురట్లలో అల్లు ముసలయ్య అనే వ్యక్తి నాలుగు అంతస్థుల భవనం నిర్మిస్తున్నారు. రామకృష్ణ మంగళవారం ఇక్కడ పనులు చేయడానికి వచ్చాడు. పనులు చేస్తుండగా అదుపు తప్పి కిందపడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతనికి గత ఏడాది అక్టోబరులో వివాహమైంది. భార్య ప్రస్తుతం గర్భవతి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్తపాలెంలో 200 కిలోల గంజాయి స్వాధీనం?

- పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు!

విశాఖపట్నం, మార్చి 19: జీవీఎంసీ 89వ వార్డు పరిధి కొత్తపాలెంలోని ఓ ఇంట్లో నిల్వ చేసిన గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కొత్తపాలెంలోని నాగేంద్ర కాలనీ జంక్షన్‌లోని మెడ్‌ప్లస్ మందుల షాపు వద్ద కాలనీకి చెందిన ఓ కుటుంబీకులు సాయంత్రం వేళలో టిఫిన్ షాపు నిర్వహిస్తుంటారు. వీరు తమ సామగ్రిని పెట్టుకునేందుకు గాను మెడ్‌ప్లస్ వెనక ఉన్న ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. కాగా టిఫిన్ షాపు యజమానికి సమీప బంధువైన ఓ వ్యక్తి తన ఇంట్లోని కొన్ని సామాన్లను టిఫిన్ దుకాణం యజమాని అద్దెకు తీసుకున్న గదిలో కొద్ది రోజుల పాటు ఉంచడానికి అనుమతి తీసుకుని వాటిని భద్రపరిచాడు. అయితే అందులో గంజాయి ఉన్నట్టు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం ఉదయం దాడి చేసి ఆ గదిలో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని గోపాలపట్నం పోలీసులకు అప్పగించారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి సుమారు 200 కిలోలు ఉంటుందని సమాచారం. గంజాయిని నిల్వ చేసినందుకు గాను ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. గంజాయి నిల్వ చేసిన గదిని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ మంగళవారం రాత్రి పరిశీలించారు. ఈ కేసు దర్యాప్తులో ఉన్నందున వివరాలు తెలపడానికి పోలీసులు నిరాకరించారు.

కోటవురట్లలో అధ్వానంగా పారిశుధ్యం

- మెయిన్ రోడ్డుపైనే చెత్తాచెదారం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు


కోటవురట్ల జంక్షన్ వద్ద వేసిన చెత్తాచెదారం

కోటవురట్ల, మార్చి 19: మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ఇళ్లలో సేకరించిన చెత్తాచెదారాన్ని పారిశుధ్య కార్మికులు తీసుకువచ్చి మెయిన్ రోడ్డుపై వేస్తున్నారు. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు విమర్శిస్తున్నారు. కోటవురట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని సాయినగర్ కాలనీలో ఇళ్ల వద్ద సేకరించిన చెత్తచెదారాన్ని పారిశుధ్య కార్మికులు తీసుకువచ్చి మెయిన్‌రోడ్డు పక్కనే వేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు కూడా అక్కడే చెత్తను వేస్తున్నారు. ఈ చెత్త కుళ్లి దుర్వాసన వస్తున్నది. ఇక్కడ చెత్తచెదారాన్ని తొలగించాలని పంచాయతీ వాసులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ వద్ద ప్రస్తావించగా మెయిన్‌రోడ్డుపై చెత్త వేస్తున్న విషయం తనకు తెలియదని, పరిశీలించి తొలగింపునకు చర్యలు తీసుకుంటానన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

శిలాఫలకంతో సరిపెట్టేశారు!

- కార్యరూపం దాల్చని బీచ్ ఫ్రంట్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు



- నాలుగున్నరేళ్ల క్రితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన
- విశాఖ స్వరూపమే మారిపోతుందంటూ కబుర్లు
- రూ.250 కోట్ల వ్యయం అవుతుందని అంచనా
- తొలిదశ పనులకు రూ.116 కోట్లతో టెండర్లు ఆహ్వానం
- కాంట్రాక్టు దక్కించుకున్న హైదరాబాద్ సంస్థలు
- అడ్వాన్స్ విడుదల చేయకపోవడంతో అగ్రిమెంట్ కూడా చేసుకోకుండానే వెనక్కి...


ఆర్కే బీచ్‌లో కోతకు గురైన ఇసుకతెన్నెలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

"విశాఖకు పర్యాటకంగా ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొస్తాం. అందుకోసమే బీచ్‌ఫ్రంట్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశాం. ఈ ప్రాజెక్టుతో ఆర్కే బీచ్ స్వరూపమే మారిపోతుంది. ప్రపంచస్థాయి సదుపాయాలతో పర్యాటకులకు స్వర్గధామంగా నిలుస్తుంది."

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

(2019 డిసెంబరు 28న సిటీ సెంట్రల్ పార్కు వద్ద బీచ్ ఫ్రంట్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సందర్భంగా...)

...అయితే నాలుగున్నరేళ్లు గడిచిపోయినా ప్రాజెక్టు కార్యరూపం దాల్చలేదు. రాష్ట్ర ప్రభుత్వం నిధుల విడుదలపై చేతులెత్తేయడంతో టెండరు దక్కించుకున్న సంస్థ అగ్రిమెంట్ చేసుకోకుండానే వెనుతిరిగిపోయింది.

విశాఖ అనగానే ఎవరికైనా ఆర్కే బీచ్ గుర్తుకొస్తుంది. అటువంటి బీచ్ హుద్‌హుద్ కారణంగా కొంత దెబ్బతింది. అలల ఉధృతికి కోతకు గురైంది. బీచ్‌ను ఆనుకుని ఉన్న పార్కుల ప్రహరీ గోడలు సైతం కోత కారణంగా కూలిపోయాయి. ఈ నేపథ్యంలో విపత్తులు వంటివి సంభవించినా ఎలాంటి నష్టం జరగకుండా బీచ్ ఫ్రంట్‌ను రీడెవలప్ చేయడంతోపాటు సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం, ప్రపంచస్థాయి వసతులను సమకూర్చడం లక్ష్యంగా ఏపీ డిజాస్టర్ రికవరీ ప్రాజెక్టు (ఏపీడీఆర్‌పీ) పేరుతో బీచ్‌ఫ్రంట్ రీడెవలప్‌మెంట్‌కు వైసీపీ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కొంత వాటా సమకూర్చేలా డీపీఆర్‌ను తయారుచేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా కోస్టల్ బ్యాటరీ నుంచి పార్క్ హోటల్ జంక్షన్ వరకూ 3.5 కిలోమీటర్లు బీచ్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఆ ప్రాంతంలో మూడు కిలోమీటర్లు పొడవున బీచ్‌లో రక్షణ గోడ నిర్మాణం, సైక్లింగ్ ట్రాక్, 1.8 మీటర్లు వెడల్పున మూడు కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్, ఐదుచోట్ల ప్రజా మరుగుదొడ్లు, ఎనిమిది చోట్ల తాగునీటి సదుపాయం, పర్యాటకులకు స్థానిక ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా ప్రస్తుతం ఉన్న దుకాణాలను చిన్నపాటి మాల్స్‌గా అభివృద్ధి చేయడం, పిల్లలు, పెద్దలకు వేర్వేరు సదుపాయాలతో రిక్రియేషన్ పార్కులు, బీచ్‌లోకి సురక్షితంగా వెళ్లి వచ్చేలా ఎంపిక చేసిన చోట ప్రత్యేక మార్గాలు నిర్మాణం, సర్వీస్ రోడ్లు అభివృద్ధి, పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు, ఆకర్షనీయంగా బస్‌బేలు, పర్యాటకులకు వసతి, రిఫ్రెష్‌మెంట్ రూమ్‌లు, పర్యాటకులు, సందర్శకులకు ఆహ్లాదం కలిగించేలా ల్యాండ్ స్కేపింగ్, సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు, దేశ విదేశాల్లో జరిగే ప్రత్యేక వేడుకలను ప్రత్యక్షంగా సందర్శకులు వీక్షించేందుకు వీలుగా యాంపీ థియేటర్, ఓపెన్ జిమ్ వంటి సదుపాయాలు కల్పిస్తామని ప్రకటించారు. ఇందుకోసం రూ.250 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఒకేసారి కాకుండా నాలుగు దశల్లో ప్రాజెక్టును పూర్తిచేయాలన్న రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు జీవీఎంసీ అధికారులు తొలిదశ పనుల కోసం రూ.110 కోట్లతో 2019లో టెండర్ పిలిచారు. హైదరాబాద్‌కు చెందిన స్టాండర్డ్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ, ఎస్‌పీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థతో కలిసి రూ.116 కోట్లకు (రూ.ఆరు కోట్లు అధికం) టెండరు దక్కించుకుంది. నెలరోజులపాటు బీచ్ వెంబడి సర్వే నిర్వహించి అక్కడున్న పరిస్థితులను గుర్తించి, తర్వాత 17 నెలల్లోగా ప్రాజెక్టును పూర్తిచేయాలని టెండర్ దక్కించుకున్న సంస్థ భావించింది.

కదలిక లేని ప్రాజెక్టు

ముఖ్యమంత్రి హోదాలో 2019 డిసెంబరు 28న తొలిసారి నగరానికి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిటీ సెంట్రల్‌పార్క్‌లో రూ.116 కోట్లతో బీచ్‌ఫ్రంట్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. విశాఖ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు మేలిమలుపు కాబోతోందని ఆ కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ నేతలు గొప్పలు చెప్పారు. కానీ, నాలుగున్నరేళ్లు గడిచినా ప్రాజెక్టు అడుగు కూడా ముందుకు పడలేదు. ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు అడ్వాన్స్‌గా కాంట్రాక్టర్‌కు కొంత మేర రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. ఈ విషయమై సదరు కాంట్రాక్టు సంస్థ ఎన్నిసార్లు ప్రస్తావించినా పాలకుల నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో అగ్రిమెంట్ చేసుకోకుండానే వెళ్లిపోయిందని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు.

ఉపమాకలో వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం

- మాఢవీధుల్లో కావడి ఊరేగింపు


అశ్వవాహనంపై స్వామివారి తిరువీధి

నక్కపల్లి, మార్చి 19: ఉపమాక క్షేత్రంలో శ్రీవారి తిరు వార్షిక కల్యాణోత్సవాలు మంగళవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభ సూచికగా ఉదయం 11 గంటలకు మాడవీధుల్లో కావడి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు పూజా కార్యక్రమాలు చేశారు. సాయంత్రం 6.30 గంటలకు ఉత్సవాల అంకురార్పణ, కంకణధారణ, మృత్యంగ్రహణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కాగా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన జాస్తి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు సుమారు రూ.2 లక్షల వ్యయంతో స్వామివారి ఆలయానికి ఇత్తడి గజ వాహనాన్ని తయారు చేయించి అందజేశారు. నూతన వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.


నూతన గజవాహనంపై స్వామివారిని ఉంచి పూజలు చేస్తున్న అర్చకులు


ఉత్సవాల ప్రారంభ సూచికగా మాఢవీధుల్లో కావడి ఊరేగింపు

ఓటు అడిగే హక్కు జగన్‌రెడ్డికి లేదు

- హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసగించారు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు పూర్తికాలేదు
- జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

తుమ్మపాల, మార్చి 19: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, అవి నెరవేర్చకుండా ప్రజలను మోసగించిన ఆయనకు రానున్న ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు లేదని ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ముఖ్యనాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా పూర్తికాలేదన్నారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మించడం చేతకాని ముఖ్యమంత్రి అని జగన్‌ను ఉద్దేశించి విమర్శించారు. రాష్ట్రంలో పూర్తిగా మద్య నిషేధాన్ని అమలు చేసిన తర్వాతే 2024 ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని ఐదేళ్ల క్రితం అధికారంలోకి వచ్చినప్పుడు జగన్మోహన్‌రెడ్డి గట్టిగా చెప్పారని, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని మహిళలను ఓట్లు అడుగుతారని కొణతాల ప్రశ్నించారు.. ప్రతి ఏటా జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చెప్పి నిరుద్యోగులను వంచించారని ధ్వజమెత్తారు. వైసీపీ నాయకులు బందిపోటు దొంగల ముఠాగా తయారై రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. కక్ష సాధింపే అజెండాగా పాలన సాగిస్తున్నారని, రివర్స్ టెండర్ పేరుతో ఒక్క అభివృద్ధి పని కూడా పూర్తి చేయలేదన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని, అనకాపల్లిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డంపెట్టుకుని టీడీపీ, జనసేన శ్రేణులను పలు ఇబ్బందులకు గురి చేశారని, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ, నియోజకవర్గంలోని కాపులకు రాజకీయ ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో జిల్లా అధ్యక్ష పదవిని సైతం త్యాగం చేస్తానని, ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి కూడా తీసుకువెళతానని చెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడమే అందరి ఏకైక లక్ష్యమన్నారు. రాష్ట్రంలో సాగుతున్న రాక్షస పాలన ముగింపునకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని, వైసీపీ ప్రజావ్యతిరేక పాలన గురించి ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మాదంశెట్టి నీలబాబు, డాక్టర్ నారాయణరావు, కొణతాల వెంకటరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యుడికి అండగా..

- నిరుపేద వెన్నెముక శస్త్రచికిత్సకు రూ.10.6 లక్షల సాయం
- విరాళాలు సేకరించి అందించిన 'సాయానికి రూ.పది సంస్థ' ప్రతినిధులు

కొత్తూరు, మార్చి 19 : అనకాపల్లికి చెందిన 'సాయానికి పది రూపాయలు సంస్థ' ప్రతినిధులు మరోసారి తమ సేవా భావాన్ని చాటుకున్నారు. సెంట్రింగ్ పనిచేస్తూ రెండంతస్తుల భవనం మీద నుంచి పడిపోయిన వ్యక్తి వెన్నెముక ఆపరేషన్ కోసం విరాళాలు సేకరించి పది లక్షల ఆరవై వేల రూపాయలను అందించారు. నర్సీపట్నం మునిసిపాలిటీ మూడో వార్డుకు చెందిన మర్ర శ్రీహరి భవన నిర్మాణ పనులకు (సెంట్రింగ్) వెళుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఏడాది క్రితం సెంట్రింగ్ పనులు చేస్తూ రెండు అంతస్థుల భవనం నుంచి కింద పడిపోయాడు. దీంతో వెన్నెముక దెబ్బతిన్నది. ఆపరేషన్ కోసం రూ.6 లక్షలపైనే ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. ఆర్థిక స్తోమత లేకపోవడంతో శస్త్రచికిత్స చేయించుకోలేక మంచానికే పరిమితమయ్యాడు. భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఎన్నో అవస్థలు పడ్డారు. నిస్సహాయ స్థితిలో ఉన్న శ్రీహరి కుటుంబం సాయం కోసం 'సాయానికి పది రూపాయలు సంస్థ'ను సంప్రదించింది. దీంతో సంస్థ ప్రతినిధులు శ్రీహరి కష్టాన్ని, పరిస్థితిని తెలుగు రాష్ట్రాల్లో ఉన్న తమ సభ్యులకు, వారి ద్వారా పలువురికి వీడియో రూపంలో పంపించారు. దీంతో ఎంతో మంది స్పందించి తమకు తోచిన సాయం అందించారు. పది రోజుల్లోనే రూ.10,59,904 సమకూరాయి. ఈ మొత్తాన్ని అనకాపల్లిలో ప్రముఖ హోమియోపతి వైద్య నిపుణులు డాక్టర్ శశిధర్, ఏఎంఏఎల్ కళాశాల బోటనీ అధ్యాపకుడు డాక్టర్ ఎం.హరిబాబు, నర్సీపట్నం ఎంఈవో జీవీఎస్ నాగేంద్ర, బయాలజీ ఉపాధ్యాయుడు వీవీ.ప్రభాకర్ చేతుల మీదుగా మంగళవారం శ్రీహరి కుటుంబానికి అందజేశారు. భారీ మొత్తంలో సొమ్ము సేకరించి, బాధిత కుటుంబానికి అందజేసిన 'సాయానికి పది రూపాయలు సంస్థ' అధ్యక్షుడు లాలం ఏసుబాబు, సభ్యులను పలువురు అభినందించారు.


శ్రీహరి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న డాక్టర్ శశిధర్ తదితరులు

పరీక్షా కేంద్రాల బందోబస్తు పరిశీలించిన ఎస్పీ


బందోబస్తుపై సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్, మార్చి 19 : పట్టణంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని గవరపాలెం ఉన్నత పాఠశాల, శ్రీచైతన్య విద్యాసంస్థల్లో జరుగుతున్న పరీక్షా కేంద్రాల్లో సిబ్బంది ఏ విధంగా బందోబస్తు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. ఆయన వెంట పట్టణ సీఐ జి. శంకరరావు ఉన్నారు.

బీసీ బాలికల గురుకులంలో వసతులపై ఆరా

- పరిశీలించిన రాష్ట్ర కార్యదర్శి


విద్యార్థినులతో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్

ఎస్.రాయవరం, మార్చి 19: మండలంలోని లింగరాజుపాలెంలోని ఎంజేపీ ఏపీ బీసీ డబ్ల్యూ బాలికల రెసిడెన్షియల్ (గురుకులాన్ని) పాఠశాలను మంగళవారం బీసీ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ అక్కడి విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే పదో తరగతి బాలికలతో మాట్లాడిన పరీక్షలు ఎలా రాస్తున్నారనేది ఆరా తీశారు. అక్కడున్న వంటశాల, వాష్ రూమ్ తదితర వాటిని కృష్ణమోహన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ వెంకటరెడ్డి, గురుకులం ప్రిన్సిపాల్ లక్ష్మి పాల్గొన్నారు.

టెన్త్ హిందీ పరీక్షకు 97.65 శాతం మంది హాజరు

అనకాపల్లి రూరల్, మార్చి 19: పదో తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన హిందీ పరీక్షకు 97.65 శాతం మంది విద్యార్థులు హాజరైన జిల్లా విద్యా శాఖాధికారి వెంకట లక్ష్మమ్మ తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 21,204 మందికిగాను 20,860 మంది హాజరయ్యారని, 344 మంది పరీక్ష రాయలేదని చెప్పారు. ప్రైవేటు విద్యార్థులు 252 మందికిగాను 93 మంది మాత్రమే హాజరయ్యారు. 159 మంది గైర్హాజరు అయినట్టు ఆమె తెలిపారు. రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు కలిపి మొత్తం 21,456 మందికిగాను 20,953 (97.65 శాతం) మంది హాజరయ్యారని, 503 మంది పరీక్షకు రాలేదని డీఈవో పేర్కొన్నారు.

తిమ్మాపురం కార్యదర్శి, వీఆర్వోలకు షోకాజ్ నోటీసులు


తిమ్మాపురం కార్యదర్శి, వీఆర్వోలను వివరణ కోరుతున్న ఆర్వో

నక్కపల్లి, మార్చి 19: ఎస్.రాయవరం మండలం తిమ్మాపురంలో పాయకరావుపేట నియోజక వర్గం వైసీపీ అభ్యర్థి కంబాల జోగులుకు చెందిన ఫ్లెక్సీని తొలగించకపోవడంతో కార్యదర్శి రామిరెడ్డి, వీఆర్వో నూకరాజుకు ఎస్.రాయవరం తహసీల్దార్ జయలక్ష్మి షోకాజ్ నోటీసులు ఇచ్చారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి చెప్పారు. వీఆర్వో, కార్యదర్శిల నుంచి వివరణ తీసుకున్నామని, ఇటువంటివి పునరావృతం కాకూడదని సూచించారని తెలిపారు.